# మరువలేని దీపావళి

దీపావళి వచ్చింది. జీవితంలో మరుపులేని దీపావళి. బతుకులో మరువలేని దీపావళి. జీవితాన్ని ఎడారిగా చేసిన దీపావళి. బ్రతుకును నందనవనంగా మార్చిన దివ్యదీపావళి రానేవచ్చింది !

ప్రమిదెల నిండా నూనెపోసి వత్తులు వేస్తోంది శారద.

"ఒక్కొక్కటీ తీసికెళ్లి ఆర్చీల్లో పెట్టు...క్రింది వేపు ఎలా సర్దాల్సిందీ — నేనొచ్చి చూపెడతాను లక్ష్మి !" పక్కనున్న పనిమనిషి కేసి చూస్తూఅంది శారద.

లక్ష్మి ఒక్కో ప్రమిదనూ జాగ్రత్తగాపట్టుక వాకిట్లోకి తీసికెడుతోంది. శారద వాచ్ కేసి చూచుకుంది. ఆరున్నర ! ఇంకా రాలేదెందుకనో ప్రసాద్ ! త్వరగా వచ్చేస్తానంటూ చెప్పివెళ్లారుకదా ? ఆతురతగా వీధివాకిట్లోకివచ్చి దృష్టి సారించింది శారద. ఎటుచూచినా ఆనందం పరవళ్లు తొక్కు తోంది. ఎలక్ట్రిక్ బల్బులు, అందంగా అమర్చి, కృత్రిమపు సౌందర్యంతో వెలిగిపోతున్నాయి కొన్ని ఇళ్లు ప్రమిదెల్లో వెలిగే వత్తులతో సహజసౌందర్య కాంతులు వెదజల్లుతున్నాయి మరికొన్ని వాకిళ్లు అందంగా ! కొత్తబట్టలు కట్టుక, ఒళ్లు మరచి గంతులు వేస్తున్నారు పిల్లలందరూ ! కొత్తల్లుళ్ళూ, కొత్తకోడళ్ళ రాకలతో, మరదళ్ళూ, ఆడబిడ్డలూ, పెద్దవాళ్లూ చేసే హడావుడికి అంతేలేదు. ఛలోక్తులతో, చిలిపినవ్వులతో

కేరింతాలూ, కేకలతో ప్రతిధ్వనిస్తున్నాయి వీధిలోని ఇళ్ళన్నీ! తరతమ భేదాలూ, అంతస్థుల స్థోమతులూ, పరస్పర విభేదాలూ, మర్చిపోయి చిందులు వేసే ఆనందంలో ఐక్యమై పోయింది ప్రకృతి!

మళ్ళీ వీధి చివరిదాకా నింపాదిగా చూచింది శారద! ఊహూ! భర్తజాడే లేదు! బరువుగా అడుగులు వేసుకుంటూ వరండాలో పడకకుర్చీలో కూచుని వెనక్కు వాలింది శారద నిట్టూరుస్తూ! ఇందాకా హుషారుగా తిరుగుతున్న ఆవిడ ముఖంలోని, నిస్పృహ చూచి విస్తుపోయింది పనిమనిషి లక్ష్మి! పలకరిస్తే కోపపడ్తుందేమోననే భయంతో. తనంతతనే మిగిలిన ప్రమిదెలలో నూనె వంచుతోంది! శారద దృష్టి వాకిటిగోడ ఆర్చిలకేసి మళ్ళింది. స్థంభాలమీదా ఆర్చిల్లో అందంగా అమర్చిన ప్రమిదెలూ, మధ్యగా వరండాలో వ్రేళ్ళాడగట్టిన ఎట్టకొవ్వొత్తుల గుచ్ఛం, వెలిగించ నందువల్ల కాంతివిహీనంగా, బట్టిమట్టిచిప్పల్లానే కన్పిస్తున్నాయ్! ఏదో శూన్యతవాటిల్లో కనపడగానే ఆమె హృదయ తంత్రులు ఒక్కసారిగా విషాదరాగాలాపన ప్రారంభించాయి. రాగాలాపన ప్రారంభమైన తక్షణం మనసులోని భావతరంగాలు — ఉవ్వెత్తుగా లేచి, నాటకరంగానికి తెర ఎత్తేసినట్లుగా అయింది. వెంటనే ఏనాడో మర్చిపోయిన, కాలప్రవాహంలో అడుగున పడిపోయిన సంఘటనలన్నీ, పాత్రధారులుగా రంగస్థలంమీదికి వచ్చేశాయి. దుఃఖోపశమనానికి బదులు, దుఃఖమే దానికి ఆలంబనగా నాటకం ప్రారంభమైంది. శారద మనోనేత్రాలు వేదనాపూరిత దృష్టులతో దాన్ని చూస్తున్నాయి.

## 2

సరిగ్గా ఐదేళ్ళక్రితం! ఇదే దీపావళి! ఇల్లాగే ఎటు చూచినా ఆనందం! సాయంత్రం ఐదుగంటలయింది. రఘు హడావుడిగా వచ్చాడు. శారదనుచూచి తన్మయుడై పోయాడు. రెపరెపలాడ్తున్న తెల్ల జార్జెటుచీరె, నల్ల జాకెట్ లో అందంగా వెలిగిపోతున్న శారద ప్రమిదెలలో నూనె వంచుతోంది! పదధ్వనులు విని వెనక్కు తిరిగి చూచింది.

రఘు నవ్వుతూ "చూడు శారదా? నువ్వంతా రెడీ చేసిపెట్టు. నేనిప్పుడే వచ్చేస్తానుమళ్లీ!...అన్నట్టు మీ అన్నయ్యేడీ?" అడిగాడు!

"అలా బజారుదాకా వెళ్ళాడు......త్వరగానే వస్తానన్నాడు...అన్నట్టు మీరు గబుక్కున వస్తారుకదూ?" శారద సందిగ్ధంగా అడిగింది.

"వేణునక్కడ వదిలిపెట్టేసి వెంటనే వచ్చేస్తాను... సరేనా?"

"ఊఁ" శారద తల ఊగించింది.

మరుక్షణం హుషారుగా ఈలవేస్తూ వాకిటిమెట్లు దిగి వెళ్ళిపోతున్న రఘును పరీక్షగా చూస్తూ స్థంభానికి ఆనుకుని నిల్చొంది శారద! తెల్లగా, భారీగా, నొక్కులజుట్టుతో, నవమన్మథుడిలా వెళ్లిపోతున్నాడు రఘు. మృదువైన మాటల్తో ఎదుటివాళ్ళ మనసుల్ని ఆకట్టుకోగల వ్యక్తి! అగాధాల్లాటి కళ్ళతో అందాల్ని నింపుకున్న చూపులూ!

చూడగానే ఏ వ్యక్తికైనా, హృదయంలో హత్తుకుపోయే ఆకారం! ఈరోజు భర్తను తలుచుకునేకొద్దీ ఆమె హృదయం అనిర్వచనీయమైన ఆనందంలో తేలిపోతోందెందుకో! చిరుగాలికి ఎగురుతున్న ముంగురులతో, స్థంభానికి ఆనుకుని, మధుర భావాలలో మునిగి తేలుతున్న శారదను చూచి విశ్వం నవ్వుకున్నాడు.

"చూడమ్మాయ్! చీకటికూడాపడింది...నువ్వింకా ఇక్కడే నుంచుని పగటికలలు కంటున్నావ్! ప్రమిదెలు తయారు చెయ్యలేదూ?" విశ్వం శారద భుజం తట్టాడు. అన్నయ్య, పిలుపూ, స్పర్శతో ఉలిక్కిపడ్డ శారద, సిగ్గుతో గబగబా లోపలికెళ్లి పోయింది. మరోపదినిముషాల్లో ఇల్లంతా వెలిగే ప్రమిదల తోరణాలతో వింత వెలుగులు విరజిమ్మింది!

టపాకాయలన్నీ వరండాలో సర్ది చెరోకుర్చీలో కూచున్నారు విశ్వం శారద.

"ఎక్కడికి వెళ్లాడమ్మాయ్ రఘు? ఇంకా రాలేదే?" విశ్వం చిరాగ్గా అడిగాడు.

"ఎవరో స్నేహితుడికి — వాళ్ళబంధువులుండే అడ్రస్ తెలీలేదట...వదిలిపెట్టి వస్తానని వెళ్ళారు!"

"ఎందాకా?"

"ఏమోఁ!"

"అయితే నేనలా వెళ్ళి చూచొస్తానుండు..." విశ్వం లేచాడు.

"నువ్వూ అల్లాగే వెళ్ళవుగదన్నయ్యా?" శారద మనసులో రఘుమీది కోపాన్ని అణుచుకుంటూ అంది.

"ఊహూం త్వరగావస్తాలే - వీలైతే రఘును వెంట బెట్టుకు..."

అన్నయ్య వెళ్ళినవేపే చూస్తూ కూర్చుందామె! సెకెండ్లు, నిమిషాలుగా, నిమిషాలు, గంటలుగా మారాయి! షుమారు గంటన్నర తర్వాత వాకిట్లో ఆగిన గుఱ్ఱం బండిని చూచి ఆశ్చర్యపోయింది శారద! బండ్లోంచి ఒంటరిగా వస్తున్న విశ్వాన్ని చూచి మరీ నివ్వెరపోయింది. పాలిపోయి, కళావిహీనమైన ముఖంతో అంగలువేసుకుంటూ వచ్చిన విశ్వం...శారద ముఖంవేపు చూచి, కళకళలాడ్తూ, తళతళ మెరుస్తున్న ఆమె నుదుటి కుంకుమబొట్టునుచూచి, కట్టలు త్రెంచుక వస్తున్న దుఃఖాన్ని బలవంతాన ఆపుకున్నాడు.

"బండెక్కు- శారదా!" ఒణికే పెదవుల్తో, ఆ తర్వాత మంటలు పెగలక, కాస్సేపు వూరుకుని "రామ్మాయ్!" అన్నాడు విశ్వం గద్దదికంగా!

శారద మరింత కొయ్యబారిపోతూ ... "ఎక్కడి కన్నయ్యా!" అంది.

"తర్వాత చెబుతాను...ముందు బండెక్కమ్మా!" విశ్వం రాని నవ్వుకు ప్రయత్నించి విఫలుడైనాడు.

నల్లబారినముఖంతో బండిలో కూచుంది శారద. జనరల్ హాస్పటల్ ఆవరణలో శిలావిగ్రహంలా యాంత్రికంగా డుస్తున్న విశ్వం వెనుక కదిలిపోయింది శారద! బెడ్ మీది

నెత్తురు ముద్దనుచూచి కంపించి పోయారిద్దరూ ! కారు ప్రమాదంలో గుర్తుపట్టరానంతగా గాయపడి, మాంసపు ముద్దగా మారి మరణించిన ఆ వ్యక్తిని చూస్తూ రఘు అతనేనని రూఢిగా నమ్మలేకపోయింది శారద. కానీ దగ్గరకువెళ్ళగానే, ఆప్యాయత తొణికిసలాడ్తూ చెక్కు చెదరని ఆ ముఖాన్ని చూచి, రెండు గంటలక్రితం, తను సంతోషంగా సాగనంపిన వ్యక్తి ఇతనేనని వెంటనే నమ్మింది ! ఆమె హృదయం ఒక్కసారిగా బద్దలయింది. గంటక్రితం - తన చేతుల్తో వెలిగించి వచ్చిన ప్రమిద లన్నిటి తాలూకు అగ్ని శరీరమంతా పాకి ప్రాణాల్ని జివ్వున లాగివేస్తోంది. దీపావళినాటి ఆ దివ్యానుభూతి, ఆక్రందనగామారి, హృదయంలోనుంచి జ్వాలారూపంగా బయటికి వస్తూ పొగలు గ్రక్కుతోంది. ప్రపంచమంతా తలక్రిందు లౌతున్నట్టుగా భ్రమించి — అచేతనంగా కిందపడిపోయింది శారద !

తర్వాత గాడితప్పిన బండిలా, ఒంకర టింకరగా బయల్దేరిన ఆమె జీవితం విషాద పూరితమై పోయింది ! విశ్వం ఆదరణా, అనురాగమూ మినహా, ఆమె జీవించటానికి ఏ బలవత్తరశక్తి ప్రేరణా లేదు !

ఓ రోజు హఠాత్తుగా అడిగాడు విశ్వం. "బి. య్యేలో చేరుతావా అమ్మాయ్ ?"

శారద ఆశ్చర్యపోయింది.

"ఎందుకన్నయ్యా ?" హృదయంలోని నైరాశ్యానికి ప్రతిరూపంగా పెదవులు కదిలాయి. పెనుగాలికి నేలకూలి

వాడిపోయిన సుకుమార లతలావున్న చెల్లెలిని చూస్తూ, అతని హృదయంలో ఆవేదనాగ్ని శిఖలు లేచింది. వాటిని అణుచుకుంటూ "నీకు పొద్దు పోతుందికదమ్మా!" అన్నాడు జాలిగా !

"ఇప్పుడయినా పొద్దు పోతోందిలే అన్నయ్యా ! ఏ పనీ చెయ్యలేను — నాకా ఉత్సాహమూ లేదు !

ఆ తర్వాత మాటలురాక, నోటికి పమిటికొంగు అడ్డం పెట్టుక గబగబ పక్కగదిలోకి వెళ్లిపోయింది శారద !

ఒక్కసారిగా మ్రాన్పడిపోయాడు విశ్వం. విధాత క్రూరచర్యకు పళ్ళుకొరుక్కున్నాడు. ఆ వేదనాంధకారంలో కొట్టుకుంటున్న అతని హృదయంలో హఠాత్తుగా ఏదో ఆశా జ్యోతి వెలిగింది. మొదలంటూ నరికిన చెట్టుకు, తల్లి వేరును మాత్రం జాగ్రత్తగా కాపాడి, నీళ్లుపోసి పెంచితే, మళ్లీ చిగురుస్తుందికదా ? కాలక్రమేణా కొమ్మల రెమ్మలతో శాఖోప శాఖ లవటానికి అవకాశం వుందికదా ? అది తప్పని ఎవరంటారు ? ఆ భావనరాగానే అతని ముఖం ఉజ్వలమై పోయింది. దాని ఫలితం ప్రసాద్ తరచూ ఇంటికి రావటానికి, శారదకు అతనితో చనువు ఏర్పడటానికీ దారితీసింది.

రానురాను శారద జీవితంలో ఓ విధమైన మార్పు రావటం విశ్వం గమనించాడు. భారతీయ పురాణ గ్రంథాల్ని ఎప్పుడూ చదువుతూ, అందులో ఏదో అర్థంకాని విషయాన్ని గురించి, ఆలోచించి, ఓ నిర్ణయానికి రావటం, ఆనిర్ణయాన్ని పట్టుక విశ్వం, ప్రసాద్‌లతో తర్కించటం ఆమెకు పరిపాటై

పోయింది...అందులో ఆమెకు అర్థంగాని విషయాన్ని గురించి విడమర్చి చెప్పడం విశ్వానికి అలవాటుగా మారింది.

శనివారం సాయంత్రం ఉపవాసం కావటంతో...తలకు పోసుకున్న జుట్టు ఆరబెట్టుక, చాపమీద కూచుని భారతం పుటలు తిరగవేస్తోంది శారద. ఆమె మనస్సు అందులో లగ్నమై పరిసరాన్నికూడా గుర్తించలేని స్థితిలోవుంది. ఎదురుగాకొద్ది దూరంలో నిల్చుని ప్రసాద్, రెప్పవేయకుండా చూస్తున్నాడు ఆమెవేపు. తడితడిగా రింగులు తిరిగినజుట్టు చాపమీద చుట్టలు చుట్టుకుంది ! ఒకవేపు చెంపమీదుగా జారి మెల్లగా కదుల్తున్నపాయ ఒకటి, చంద్రబింబాన్ని కబళించబోతున్న కాలనాగులా కన్పిస్తోంది. అగాధాలను తొలుచుకుపోతూ, ఆలోచిస్తున్న ఆ సోగకళ్ళల్లో అర్థంకాని వ్యథ వ్యక్తమాతోంది ! ముఖంమీద దోబూచులాడ్తున్న ముంగురులూ. శూన్యంగావున్న నుదురూ చూస్తుంటే, ఆ వెలితి భర్తీచేస్తేకానీ మనసుకు ఆరాటం తగ్గదనిపిస్తోంది. తెల్లటి బట్టల్లో, ప్రసిద్ధ చిత్రకారుడు గీచిన అందమైన రేఖాచిత్రం లాటి ఆ వ్యక్తినిచూచి బరువుగా నిట్టూర్చాడు ప్రసాద్ ! కొద్దిదూరంలో వేడినిట్టూర్పు ధ్వనివిని తలెత్తిచూచి ఆశ్చర్యపోయింది శారద ! సన్నగా, పొడుగ్గా, అందంగావుండే ప్రసాద్ — ఇలా ఎంతసేపయిందో వచ్చి నిల్చుని ! ఆమె నవనాడులూ సిగ్గుతో కుంగిపోయాయి. పలకరించకుండా తన వేపే చూస్తూవున్న ప్రసాద్‌తో కాస్త కోపంగా అంది శారద "ఎంతసేపయింది వచ్చి ?"

తక్కున ఇహలోకంలో పడ్తూ "అహఁ ఇప్పుడే వచ్చాను...విశ్వం లేడా శారదాదేవీ ?"

"ఊహూఁ లేడు...ఇప్పుడే వస్తాడులే...అలాకూచో ప్రసాద్ "చెంపలమీది జుట్టును వెనక్కు చూసుకుంటూ కుర్చీ చూపించింది శారద.

కుర్చీలో కూర్చుంటూ "ఏమిటాపుస్తకం ?" ప్రసాద్ కుతూహలంగా అడిగాడు.

"భారతం...శాంతిపర్వం "శారద క్లుప్తంగా జవాబిచ్చి — కాఫీగ్లాసు టేబిల్‌మీద పెట్టింది ప్రసాద్‌కు ఎదురుగా !

"ఓహ్ ! బోలెడన్ని నీతులూ — అవ్వీదొారుకుతాయి...ప్చ్ సిల్లీ ! ఊకదంపుడు... !". కృత్రిమ పరిహాసాన్ని ముఖంమీద చూపాడు ప్రసాద్ !

అనుకోకుండా శారదముఖం ఎఱ్ఱబడింది...కోపంగా చూస్తూ "ఆనాటి ధర్మాధర్మాలూ, నియమనిబంధనలూ, ఈనాడు రూపుమాసి పోయినంతమాత్రాన "సిల్లీ" అనీ 'ఊకదంపుడు' అనీ తీసిపారెయ్యటానికి వీల్లేదు ప్రసాద్ ! కేవలం ఊకదంపుడే అయితే, పేకమేడలా కొద్దికాలంలోనే కూలి పోతాయి. యథార్థాలు మాత్రమే శాశ్వతంగా ఉంటాయనే సంగతి నీకు తెలీదా ప్రసాద్ ?"

కోపంగా బుసలుకొడ్తున్న ఆమె ముఖాన్ని చూస్తూ మరింత ఆనందిస్తున్నాడు ప్రసాద్ !

అప్రయత్నంగా అతని దృష్టి గోడమీది కాలెండర్ మీదికి మళ్ళింది..."అరె అన్నట్టు ఎల్లుండి దీపావళి కదూ ?" అన్నాడు మామూలుగా మాట మారుస్తూ !

ఉలిక్కిపడింది శారద. ఒక్కసారిగా రఘు - ఆనాటి సంఘటన కళ్ళ ఎదుట కన్పించాయి. ప్రసాద్ అక్కడవున్నా డనే గమనిక కూడా లేకుండా ఆమె దుఃఖం కట్టలు తెంచు కుంది. హృదయవీణ విషాదగాథను ఆలాపించటం మొద లెట్టింది. భాషరూపంలో పెదవులు దాన్ని అనువదించాయి... అశ్రువులు దానికి శ్రుతికలిపాయి.

ఖ్రాన్పడిపోయాడు ప్రసాద్ ! అనుకోకుండా అన్న తనమాటలు ఆమె హృదయాన్ని అంత గాయపరుస్తుందని అతను కలలో కూడా అనుకోలేదు !

"అప్పట్నుంచీ నాలో ఉత్సాహమూ లేదు...బహుశా ప్రాణంకూడా లేదేమో ప్రసాద్ !" 'దీపావళి' అనగానే నా బ్రతుకును విధ్వంసంచేసిన క్రూరరాక్షసి అనిపిస్తోంది..." ఆమె బరువుగా నిట్టూర్చింది. శిలాప్రతిమలా వింటున్నాడు ప్రసాద్ !

"విశ్వం అన్నయ్య ఆదరణలో ఓవిధంగా ఆ బాధను మర్చిపోగలుగుతున్నాను...కొంతవరకూ, నా హృదయంలోని శూన్యతను అన్నయ్య అనురాగంతో పోగొట్టుకో గలుగు తున్నాను..."

"అరె ! ఎంతసేయిందేవిట్రా ప్రసాద్‌వచ్చి ? నేను నీ రూంకు వెళ్ళొస్తున్నాను !" విశ్వం పరీక్షగా ఇద్దరి ముఖాల

కేసిచూచి తక్కున ఆగిపోయాడు ! తనను తాను సంబాళించుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది శారద ! విశ్వం ఏమనుకుంటాడోననే తత్తరపాటులో ఉండిపోయాడు ప్రసాద్ !

*　　　*　　　*　　　*

రాత్రి విశ్వానికి భోజనంపెట్టి, పాలు చల్లార్చుతుంటోంది శారద ! ఒక గ్లాసులోనుంచి మరోగ్లాసులోకి పోసే పాలనురగ చప్పుడు మినహా మరేశబ్దమూ లేదు ! కుర్చీలో కూచునివున్న విశ్వం కళ్ళుమూసుక ఆలోచన్లో పడ్డాడు. సాయంత్రం ప్రసాద్‌తో బీచ్‌లో గడిపినకాలమూ, అతని మాటలూ - కళ్ళకు కన్పించి, చెవుల్లో ప్రతిధ్వనించాయి.

"బాలవితంతువు కాదనే సంగతి నాకు తెలుసు విశ్వం ! ఏ వితంతువేనా కానీ! జీవితం నాశనమైపోయిన వ్యక్తి, అవునా? అలాటి శారద జీవితాన్ని మళ్ళీ బాగుచేస్తాను విశ్వం ! నీ కభ్యంతరం లేకుంటే, శారద కిష్టమైతే నేనామెను వివాహం చేసుకుంటాను విశ్వాం ! ఆమెలో ఎంతో సంస్కారం, ఉత్సాహం, ధైర్యం అన్నీవున్నాయి. కానీ తాత్కాలికంగా నీరస పడిపోయింది. నా సాన్నిధ్యంలో, నా సహచర్యంలో ఆమె వాటిని తిరిగి తెచ్చుకుంటుంది. జీవితం ఆనందమయంగా గడప గల్గుతుందనే దృఢవిశ్వాసం నాకుంది విశ్వం...ఏమంటావ్ ?" అన్నాడు ప్రసాద్ !

విశ్వం హృదయం ఒక్కసారిగా ప్రసాద్ మీద కృతజ్ఞతతో, ఆనందంతో నిండిపోయింది ! కానీ శారద ఏమంటుందో ? అభ్యుదయ భావాలున్న మనిషే శారద ! కాని

స్వవిషయంలో ధైర్యం చేయగలదా? అనుమానాలు ఈగల్లా ముసురుకున్నాయి! చివరకు ఎలాఅయినా ఒప్పించాలి, అనే దృఢనిశ్చయంతో విశ్వం లేచి, వంటగదివేపు వెళ్ళాడు. పాల గ్లాసు నురగకట్టి పక్కనవుంది. గోడకు చేరగిలబడి ఏదో తీవ్రంగా ఆలోచిస్తోంది శారద. తెల్లటి బట్టల్లో ఆనాడు దీపావళిరోజు, మధుర భావాల తరంగాలలో తేలి తూలిపోతూ స్తంభానికి ఆనుకుని నించున్న ఆ శారద ఈమేనా? అతని కళ్ళు చెమ్మగిల్లాయి. హృదయంలో ఎవరిదో బలవత్తర హస్త మొకటి కెలుకుతున్నట్టుగా అనిపించింది...ఆనాటి ఆమె భావాలు సుందర స్వప్నాలు! ఈనాటి ఈమె ఊహలు వేదనా భరితాలు! తెలీని నిండుతనం ఆమెలో నిండివుండేది. అర్థంకాని ఆవేదన ఈమెలో స్పష్టంగా కన్పిస్తోంది.

పీటవాల్చిన చప్పుడువిని, ఊహాలోకంనుండి వైదొలగి, వచ్చిన శారద పక్కకు తిరిగి చూచింది! తనవేపే చూస్తూ కనుకొలుకుల్లో నీళ్ళునిండిన అన్నయ్యవేపు చూచి వింత పడింది!

విశ్వం ముఖంలో చిరునవ్వు తెచ్చుకుంటూ "ఇంకా పాలు తాగలేదా శారదా? పండ్లుకూడా తెచ్చాను తీసుకున్నావా?" ఆప్యాయంగా అడిగాడు.

"లేదన్నయ్యా! ఆకలిగా లేదసలు!" సహజ నైరాశ్యం కంఠంలో ప్రతిధ్వనించింది!

కాస్సేపు మౌనం తర్వాత హఠాత్తుగా అడిగాడు విశ్వం. "ప్రసాద్‌నుగురించి నీ అభిప్రాయ మేమిటమ్మాయ్?"

అనుకోని ఈ ప్రశ్నకు నివ్వెరపోతూ, మెల్లిగా అంది శారద "ఏముందన్నయ్యా! చదువూ, సంస్కారం రెండూ ఉన్నవ్యక్తి: మంచిచెడుల తారతమ్యం, సదసద్వివేచనా జ్ఞానం తెలిసినమనిషి!" ఆమె కళ్ళల్లో ఏదో వింత వెలుగు కన్పించింది విశ్వానికి.

"నే నోమాట అడుగుతాను శారదా? ఏమీ అనుకోవు గదూ?" విశ్వం లక్ష్యానికి పక్కవాటుగా దారితీశాడు.

వింతగా చూచి తలాడించింది శారద. "అడుగు" అన్నట్టుగా వున్నాయ్ ఆమె చూపులు!

"నేను వివాహం చేసుకోవటం నీ కిష్టమేనా అమ్మాయ్?"

"అదేమిటన్నయ్యా! అలా అంటావ్? అంతకంటే నే కోరేదేముందీ?" శారద ఆవేశంగా అంది.

"కదా! అలాటప్పుడు నువ్వు సుఖంగావుంటేనే నాకూ సంతోషం!" విశ్వం మాట పూర్తికాకముందే శారద అడ్డొస్తూ "ఇప్పుడు నేను సుఖంగా లేనని ఎవరన్నారు?" అంది.

"ఎవరో కాదమ్మాయ్! నీ మనస్సు చెబుతోంది! రఘుకూ, నాకూవున్న భేదం, మా ఇద్దరి సాన్నిధ్యంలో విడి విడిగా నువ్వు పొందే అనుభూతీ, ఒక్క నావల్ల నీకు లభ్యం కాదమ్మా!" విశ్వం గమ్యానికి చేరువగా వచ్చాడు.

శారద మౌనంగా వింటోంది...ఆమె మనసులో విశ్వం భావం కొంతవరకూ అర్థమైనా, ఏదో అనుమానాల తెరలు కొన్ని చుట్టూ చుట్టుకున్నాయి!

విశ్వం మళ్ళీ అన్నాడు "చూడమ్మాయ్! నిజం చెబుతున్నాను. నీ మనస్సు ఆనందంగావుంటే నేను సంతోషం పొందుతాను! నీవు కళకళలాడ్తుంటే నాహృదయం పరవశమౌతుంది! ఒక్కగా నొక్క చెల్లెలి జీవితం ఇలాకావటంతో నా మనసులో రేగిన తుఫాను - నే మాటల్లో చెప్పలేనమ్మా!" విశ్వం ఆవేదనగా అని ఆగాడు.

శారద కళ్లు ప్రేమతో నిండిపోయాయి! వాటిలో కృతజ్ఞత తొణికిసలాడింది!

"నువ్విలా మోడువారిన జీవితాన్ని గడుపుతూ, నేను నీ సమక్షంలో వివాహం చేసుక ఆనందాన్ని ఆస్వాదించలేను! పైగా నువ్వుకూడా అది భరించలేవమ్మా!" బాధగా చూస్తూ గంభీరంగా అన్నాడు విశ్వం! "నీ జీవన లతను మళ్లీ చిగురింపచేస్తేనే కానీ నా మనస్సుకు ప్రశాంతత రాదమ్మాయ్!"

శారద అలాగే చూస్తోంది.

"నీకిష్టమైతే ప్రసాద్‌తో నీకు మళ్ళీ వివాహం చెయ్యాలని..." గబుక్కున అన్నాడు విశ్వం! ఆమె ముఖంలో ఎలాటి భావ పరివర్తనా లేదు! ఇన్నాళ్ళుగా విశ్వం మనసులో ఈ ఊహవుందనే సంగతి ఆమెకు తెలియకపోలేదు.

విశ్వం చెప్పుకుపోతున్నాడు "ప్రసాద్ ఈరోజు నీకు కొత్తగాదు...అతని మనస్తత్వాన్నీ, విశాలహృదయాన్నీ నువ్వు బాగా అర్థం చేసుకున్నావనుకుంటాను...ప్రసాద్ తనంత తనుగా నీ కభ్యంతరం లేకపోతే వివాహం చేసుకుంటానని చెప్పాడు! నీ కీ విషయంలో సందేహమేదేనా వుందా శారదా ?" కుతూహలంగా అడిగాడతను !

శారద పెదవులు మెల్లిగా కదిలాయి ! ఆ గంభీర కంఠ స్వరం విని అతను చకితుడైనాడు.

"అన్నయ్యా ! సిగ్గూ బిడియాల్ని పక్కకు నెట్టి అన్నీ నీతో చెబుతాను ! నువ్వన్నట్టు "ఈర్ష్య ద్వేషం లేదంటూ" ఆత్మవంచన చేసుక అబద్ధం చెప్పినా ప్రతిమనిషీ పరిసర వాతావరణాన్ని చూచి బాధపడటం సహజమే ! నా విషయంలో కూడా అందుకు భిన్నంగా జరగదు ! నీకు జ్ఞాపకం ఉందా అన్నయ్యా ? కాలేజిలో 'వితంతు వివాహాలు' మీద లెక్చరిచ్చి వెండికప్పు బహుమతి తెచ్చుకున్నాను ఓరోజు ! అమ్మా, నువ్వూ, నేనూ హాల్లో కూచొనివుంటే, నువ్వేమన్నావో తెలుసా ?" శారద విశ్వంవేపు చూచింది.

విశ్వం బాధగా నవ్వాడు. గతించిపోయిన కాలంలో కలసి కరగిపోయిన దృశ్యం కళ్ళకు కట్టింది. "ఊఁ ఉపన్యాసాలిచ్చేవాళ్ళేగానీ ఆచరణలో పెట్టేవాళ్ళెవరూ లేరు...ఒకవేళ నువ్వే..." అన్నాను. అమ్మ 'శకునపక్షీ' అంటూ తారాజువ్వలా లేచింది...హుఁ, నిజంగా నాది చెడ్డనోరు శారదా ?"

"ఛ ! చెడ్డా లేదు...ఏమీ లేదులే ! నువ్వానాడు అన్నమాట నిజమే ! ఆదర్శాలు ఆచరణలో పెట్టటం అంత సులభసాధ్యం కాదు... ! ఓ సందేహం అన్నయ్యా ! నేను ప్రసాద్‌ను పెళ్ళిచేసుకుంటే...ద్రోహం కాదంటావా ?" శారద నిశ్చలంగా అడిగింది !

"ద్రోహమా ? ఎవరికి ?" విశ్వం ఆశ్చర్యంగా అడిగాడు !

"పరలోకంలోవున్న మీ బావకు..." శారదమాట పూర్తికాకముందే విశ్వం చిన్నగా నవ్వుతూ "రఘుకా ? అయితే పురాణ గ్రంథాల్లోని ఇహపరలోకాలూ, సఫలతా సాధనాలూ, అన్నీ నీకు బాగా ఒంట బట్టాయన్నమాట ! ఒక్కమాట వినమ్మాయ్ ! నేను స్వర్గనరకాలనూ, పాప పుణ్యాలనూ గురించి నమ్మను ! చనిపోయిం తర్వాత మనిషి అనుభవించబోయే స్వర్గనరక అనుభవాల్ని గురించి కూడా నాకు ఊహ లేదు ! అలాటప్పుడు ఎప్పుడో మనల్ని వదలి వెళ్ళిన రఘుకు మనం ద్రోహం చేస్తున్నామనుకోడం నామట్టుకు నాకు తెలివితక్కువ అవుతుంది ! అదే నువ్వన్నావే ద్రోహ మని...అది ఎవరికి వర్తిస్తుందో తెలుసా ? మనిషి బతికి వుండి... తాత్కాలిక ఎడబాటు సమయంలో నీచంగా ప్రవర్తిస్తే అది పాశవిక ప్రవృత్తిఅనీ, నిజమైన ద్రోహమనీ నేనూ అంటాను. అలాటి స్త్రీలను నీచంగా కూడా చూస్తాను ! కానీ జీవితంలో మరి ఆశలేని నీలాటివారు – అదయినా – కేవలం పశుప్రవృత్తిగాకాక ఒక వ్యక్తిని వివాహం చేసుక

ఆదర్శజీవితం గడపటానికి నే ప్రోత్సాహిస్తానమ్మాయ్ ! అది తప్పు అనిగానీ, అపవిత్రమనిగానీ, ద్రోహమనిగానీ నేను అన లేను శారదా ! ఆ వివాహం చేసుకున్న వ్యక్తికి ద్రోహం చెయ్యకుండా వుంటే — మరిక అందులో తప్పేముంది ?'' విశ్వం శారదవేపు చూచాడు. ఆమె పంచేంద్రియాలూ కేంద్రీకరించి వింటోంది.

''చూడమ్మాయ్ ! మానవ సహజమైన కోరికల్ని, ఊహల్ని మనసులో పెట్టుక, అహర్నిశలూ వాటితో పోరా డుతూ, కేవలం పాపపుణ్యాల భయంతో, అవి ఆచరణలో పెట్టలేక, మనసంతా కల్మషభరితంగా చేసుకోటం — అదేమి టమ్మాయ్ ? ఆత్మవంచన ! ఆత్మద్రోహం ! అలాటప్పుడు ఆ కల్మషాన్ని పేరుకోనియ్యకుండా శుభ్రంగా మనసులో భావాల్ని, పరిమితంగా ఆచరణలో పెట్టుకోటంలో తప్పూ లేదు, ద్రోహమూ కాదు ! సీతా, సావిత్రిలాటి పతివ్రతామ తల్లులు అందరూ కాకపోవచ్చు ! అలాటివారుంటే వారిని ఎంతగానో గౌరవిస్తాను ! కాని బ్రతుకుబాటలో కుంటుపడి - జీవచ్ఛవాల్లా జీవితాన్ని గడుపుతుండే స్త్రీలు రెండో పెళ్ళి చేసుకోడం - ఎక్కడో పరలోకంలో వాళ్ళకు ద్రోహం చెయ్యటమని నేననుకోను !'' విశ్వం గంభీరంగా అన్నాడు. శారద మనసులోని సన్నని పొర ఏదో తొలగిపోయింది !

''పోనీ పాప పుణ్యాలూ, ద్రోహ విద్రోహాల జోలికి ఇక పోనులే ! మరి మన సంఘం మెచ్చుతుందా ? లోకం

హర్షిస్తుందా ? మన మనస్సులంత పురోభివృద్ధిలోకి వచ్చిందా అన్నయ్యా మన సమాజం ?'' శారద ఆసక్తిగా అడిగింది !

విశ్వం గలగల నవ్వాడు. ''శారదా ! చెప్పకుండా దాచిన సందేహాలు నీమనసులో చాలా వున్నాయమ్మాయ్ ! సంఘానికీ లోకానికీ నువ్వు భయపడ్తావా? అయితే శారదా ! నే చెప్పేవన్నీ అబద్ధాలుగా, తమాషాలుగా నీకు అనిపిస్తే అనిపించవచ్చు ! కానీ వాటిల్లో దాగివున్న నగ్నసత్యాన్ని నువ్వు కాదనలేవు ? ఓ నలుగురు పసలేని మనుషులు ఒకచోట తారసపడితే, వాళ్ళు చేసే పనేమిటి ? చుట్టుపక్కల వాళ్ళను విమర్శించడమే ! అలాటివాళ్ళు మరికొందరు కలిస్తే అదే నువ్వన్నావే...ఆ సంఘం ! ఆ సంఘాల సమూహమే లోకం ! ఈ సంఘంచేసే పనుల్లో ముఖ్యమైనవి కొన్ని వున్నాయమ్మాయ్ ! అవేమిటో తెలుసా ? పిరికివాణ్ణి మరికాస్త బెదిరిస్తాయ్ ! పరిగెత్తేవాణ్ణి మరికాస్త తరుముతయ్ ! సిగ్గు, బిడియం, మొహమాటంలాటి వాటితో తలవంచుకు పొయ్యే వాణ్ణి చూచి గేలిచేసి మరికాస్త క్రుంగదీస్తాయ్ ! అదే ''నే చేసేది మంచిది - నా యిష్టం !'' అంటూ సిగ్గూ బిడియాల్ని పక్కకు నెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేవాణ్ణి ఈ సంఘంగానీ, లోకంగానీ కన్నెత్తిచూడను కూడా లేవు సరిగదా తలవంచుక పక్కకు తప్పుకుంటాయి ! చూడు శారదా ! నేను కేవలం వివాహమే జీవిత పరమావధి అంటున్నానని అనుకోకు ! స్త్రీ పురుష జీవితాల్ని చక్కదిద్దుకోటానికి పనికివచ్చే ఓ చిన్న అవకాశం వివాహం ద్వారా ఏర్పడుతుంది ! దానిని మనసులో ఉంచుక స్త్రీ పురుషు లిద్దరూ

ప్రకృతి యిచ్చిన బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి! ఇందులో ఏ ఒక్కరూ ఒంటరిగా దానిని పూర్తి చెయ్యలేరు!" విశ్వం ఘట్టిగా ఊపిరి పీల్చాడు. శారద నివ్వెరపోయి చూస్తోంది. వెలలేని రత్నాల రాశి ఏదో తనముందు కన పడ్డట్టుగా అనిపించింది.

"పోనీ. అదంతా చెప్పుకుపోతుంటే చాలావుంది! నిన్నూ ప్రసాద్‌నూ ఇప్పటికే లోకం వెక్కిరిస్తోంది. ఇందాకా, నిన్ను ఆమూలంగా అనుమానిస్తూ, అవమానించాలని కాచుకున్నా చున్న సంఘం నోరు తక్కున మూతపడాలంటే – మీ ఇద్దరూ వివాహం చేసుకుంటేసరి! అదే నువ్వు ఒంటరిగా ఎంత జాగ్రత్తగా మెలిగినా – ఎంత ఆదర్శంగా గడిపినా – సంఘం – లోకం నీమీద ఏదో ముద్రవేస్తుంది! ఆ బదులు – నీకుండే అభ్యుదయ భావాలను – ప్రసాద్‌లాటి వ్యక్తి కలయికతో మరింతగా ముందుకు నడవగలవన్నాయ్! కానీ ఒక్కటి చెబుతున్నా శారదా! ఆత్మవంచన చేసుకోకుండా, నువ్వు వివాహం చేసుకున్నంతమాత్రాన – కళంక మేమీరాదు... ద్రోహమూ కాదు..." గంభీరంగా చెప్పుకుపోతున్న అతని మాటలకు అడ్డుపడ్తూ

"అర్థమైందన్నయ్యా! భర్తృహీన ననేవంకతో నీచంగా ప్రవర్తించేకంటే, శుభ్రంగా వివాహం చేసుకున్నందువల్ల తప్పేమీ లేదనికదూ నీ ఉద్దేశ్యం ?" ఆమె కళ్లు ఉజ్వలమై పోయాయి.

"ఆ ! అంతేనమ్మా ! మరి సందేహం లేవేనా వున్నాయా ?" చేతిగుడ్డతో ముఖం తుడుచుకుంటూ అడిగాడు విశ్వం !

ఏదోలోకంలో విహరిస్తున్నట్టుగా తేలిపోతూ, ఆనందాతిశయంతో హృదయం నిండుకుపోయిందామెకు... మెల్లిగా పెదవులు విప్పుతూ "ఊహుఁ ఏమీ లేదు...ఇక నీ ఇష్టమన్నయ్యా !" ఓ విధమైన సిగ్గుతో ఆమె ముఖం ఎఱ్ఱబడింది ! విశ్వంగ చెవులకు వీణానాదంగా విన్పించిందామాట ! తేలికైన హృదయంతో ఆమెవేపు ఆప్యాయంగా చూస్తూ లేచి నిల్చున్నాడు !

దీపావళి వచ్చింది ! అంధకారబంధురమైన హృదయంలోలాగే, ఇంట్లోకూడా ప్రమిదలు వెలిగాయి. నరకుడి వధతో అంధకారబంధురంగావున్న లోకం – ఒక్కసారిగా ఆనందపు వెలుగులో విరజిమ్మిన సంఘటన కేవలం ఊహ మాత్రంగా వున్నా, శారద జీవితంలోని ఆ దీపావళి – మనోవేదనాంధకారాన్ని పోగొట్టి నూతనోత్సాహాన్ని వెదజల్లే అఖండజ్యోతిగా రూపొందింది !

ఆ ఆనందపారవశ్యంలో రెండేళ్లు ఎలా గడిచిపోయాయో శారదకు తెలీదు! విశ్వం, రమల పెళ్లికూడా అయిపోయింది ! మళ్లీ దీపావళి వచ్చింది !

"శారదా ! ఏమిటలావున్నావ్ ? ఏమయింది ?" చెంపలమీది చల్లని చేతుల స్పర్శతో కళ్ళు తెరిచి చూచింది శారద !

ఆమె మనోవీధిలో అద్భుతంగా జరిగిపోతున్న నాటకానికి తెరపడిపోయింది! పాత్రధారులు మాయమయ్యారు! అస్పష్టంగా దూరంగా వెడుతున్న ఆ పాత్రధారు లందరి రేఖల్లో — ఎదురుగా ఒక్క ప్రసాద్ రూపం మాత్రమే ఆమెకు కన్పించింది! ఆప్యాయత తొణికిసలాడే కంఠంతో "ఏమిటి శారదా?" అన్నాడు ప్రసాద్ మళ్ళీ! మబ్బుతెర విడిపోయి - మరుగుపడిన తారలూ, వాటితో అందంగావున్న నిర్మలాకాశంలా ఆమె హృదయం తేలికపడింది.

"వచ్చారా?" అంటూ గబుక్కున లేచి నిల్చుంది.

కొద్ది నిమిషాలలో శూన్యంగా వట్టి మట్టిచిప్పల్లావున్న ప్రమిదెలలో, దివ్యజ్యోతులు వెలిగాయి. శారద హృదయంలాగే అవికూడా తమ ఆనందాన్ని ఉజ్వల ప్రకాశంతో, వ్యక్తం చేస్తున్నాయి. చుట్టూ చిందులు త్రొక్కే ఆనందంలో సంతోషపు రంగవల్లులు తీర్చిన దీపావళి చేసే, స్వచ్ఛంద గందరగోళంలో, మునిగివున్న పరిసరాన్ని చూస్తూ, తన్మయత్వంతో, తృప్తింగా చూచింది శారద ప్రసాద్ వేపు!

దీపావళి వచ్చింది! దివ్యదీపావళి! జీవితంలో మరపురాని దీపావళి! బ్రతుకులో మరువలేని దీపావళి - జీవితాన్ని ఎడారిగా చేసిన దీపావళి! బ్రతుకును నందనవనంగా మార్చిన దివ్యదీపావళి! రానేవచ్చింది.